క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కంబాలచెరువు: రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు, ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదివారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. కాట్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి బంగారురాజు, రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ దేవలంక బూరయ్య, రిటైర్డ్ డైరెక్టర్ కోటిపల్లి సత్యనారాయణ, కాపు నాయకులు దేశిరెడ్డి బలరాంనాయుడు, కాట్వా రిటైర్డ్ వింగ్ చైర్మన్ చేబ్రోలు వెంకటచలం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగిన రామారావు, కాప్రాక్స్ జిల్లా అడ్మిన్ పడాల చక్రినాయుడు, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రమణరావు పాల్గొన్నారు.

సరస్వతీ ఘాట్‌లో స్వచ్ఛ భారత్

కంబాలచెరువు: నగరంలోని సరస్వతీ ఘాట్‌లో ఆదివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛ భారత్, సేవ్ గోదావరి కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మాధవి బృందం సౌజన్యంతో యోగా తరగతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిర్వాహకులు కృష్ణారావు, మధు, కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, పోలుకొండ సాయి, ఆకుల శిరీష, విమల, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి పాల్గొన్నారు.

అవార్డు పొందడం అదృష్టం

బుర్రకథ కళాకారుడు కృష్ణ



కృష్ణను అభినందిస్తున్న ఎంపీ తదితరులు

సీటీఆర్ఐ: ఎన్టీఆర్ జాతీయ అవార్డు పొందడం తన అదృష్టమని ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీర్నాల కృష్ణ అన్నారు. విశాఖపట్నానికి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ జాతీయ వార్షికోత్సవాల సందర్భంగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కళాకారుడు కృష్ణకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందజేశారు. అదే వేదికపై విశాఖ రత్న కల్చరల్ అసోసియేషన్ నుంచి కళాసేవా రత్న అవార్డు కూడా ఆయనకు లభించింది. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయనకు ఎంపీ పురందేశ్వరి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ ఆర్ కృష్ణబాబు, జిల్లా బేడ బుడగ జంగాల అధ్యక్షుడు వీర్లపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో పే ఫోన్లు



పే ఫోన్‌లో మాట్లాడుతున్న విద్యార్థినులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో పేఫోన్ పేరిట టెలిఫోన్ బాక్సులను ఏర్పాటు చేశారు. గురుకుల పాఠశాలలో మూడు పేఫోన్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా విద్యార్థినులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకునే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ అఖిల తెలిపారు. ఈ ఫోన్లు వినియోగించుకునేందుకు విద్యార్థినులకు ప్రభుత్వం ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్‌కార్డులు అందజేసిందన్నారు. నిమిషానికి రూపాయి ఖర్చవుతుందని, ఈ కార్డును రీచార్జి చేయాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు సూచించిన నాలుగు ఫోన్ నంబర్లకు మాత్రమే విద్యార్థినులు ఫోన్ చేసే అవకాశం కల్పించినట్టు ప్రిన్సిపాల్ అఖిల తెలిపారు.

సినిమాలు



శ్యామల	: కిష్కింధపురి
సూర్య మినీ	: బ్యూటీ
సూర్య ప్యాలెస్	: డిమోన్ స్లేయర్
స్వామి	: మిరాయ్
అనుశ్రీ	: బ్యూటీ
శివజ్యోతి హాస	: కిష్కింధపురి, వీరచంద్ర
రాజా	: లిటిల్ హార్ట్స్
ఊర్వశి	: లిటిల్ హార్ట్స్
మేనక	: టన్నెల్
రంభ	: మిరాయ్
అప్సర	: దక్ష, కొత్తలోక
అశోక	: భద్రకాళీ
నామవరం	
వీఎస్ మహల్	: మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కిష్కింధపురి, మిరాయ్
కడియం	
వెంకటసూర్య	: కిష్కింధపురి

నిర్లక్ష్యపు నీడ

- అధ్వాన స్థితిలో నగర సుందరీకరణ
- డివైడర్లలో మొక్కల పెంపకం గాలికి..
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్ యంత్రాంగం
- గత ప్రభుత్వ హయాంలో పచ్చదనానికి పెద్దపీట

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రాత్మకమైన రాజమహేంద్రవరం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి ఎంపీ మార్గాని భరత్‌రామ్ చేపట్టిన సుందరీకరణ పనులపై 'నిర్లక్ష్యపు' నీడలు అలుముకుంటున్నాయి. నగరంలో డివైడర్లపై అభివృద్ధి చేసిన మొక్కలను పూర్తి స్థాయిలో సంరక్షించి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడింది. దీంతో విలువైన మొక్కల చుట్టూ పిచ్చిమొక్కలు ఇష్టారాజ్యంగా పెరిగిపోయాయని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హరిత యువత పేరుతో చేపట్టిన మొక్కలు పెంచే కార్యక్రమం పూర్తిగా గాలికి వదిలేశారని వాపోతున్నారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన నగరపాలక సంస్థ యంత్రాంగం నిర్లక్ష్యం ఫలితంగా పలు ప్రాంతాల్లో అవి నశిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం నగరంలో పచ్చదనానికి శాపంగా పరిణమించింది. పచ్చదనానికి పెద్దపీట వేస్తున్నామని, స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతున్నామని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు.

నగరంలోని ఆనాల వెంకట అప్పారావు రోడ్డు, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు, తిలక్ రోడ్డు, పరమహంస యోగానంద మార్గ్, లాలాచెరువు రోడ్డు, పేపర్‌మిల్ రోడ్డు, అజాద్ చౌక్, నందం గనిరాజు జంక్షన్, సిమెట్రీపేట జంక్షన్ రోడ్డు, వీఎల్‌పురం ఇలా పలు రోడ్లలో డివైడర్లపై లక్షలాది రూపాయల వ్యయంతో పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటించారు. వాటిని సంరక్షించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు సరైన శ్రద్ధ చూపకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో డివైడర్లపై మొక్కలు చనిపోయాయి. చనిపోయిన వాటిని తొలగించి, కొత్తవి నాటించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిర్వహణ లేకపోవడంతో డివైడర్లపై పిచ్చిమొక్కలు పెరిగినా, వాటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో 50 డివిజన్లలో 33 కిలోమీటర్ల మేర డివైడర్ల మధ్య పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వీటిలో 13 కిలోమీటర్లు, 6 కిలోమీటర్లను ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. మిగిలిన 14 కిలోమీటర్లను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పర్యవేక్షించాల్సి ఉంది. పలు ప్రాంతాల్లో డివైడర్లపై మొక్కల సంరక్షణ లేక దెబ్బతింటున్నాయని, సరైన సమయంలో ట్రిమ్మింగ్ చేయకపోవడంతో ఇష్టారాజ్యంగా పెరిగిపోతున్నాయని నగరవాసులు చెబుతున్నారు. ప్రతి 15 రోజులకు చేపట్టాల్సిన ట్రిమ్మింగ్ పనులకు స్వస్తి పలికారు. దీనిపై నగరపాలక సంస్థ ఉద్యానవన అధికారి అనితను వివరణ కోరగా, ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు. నగరంలో 3 కిలోమీటర్లు, 19 కిలోమీటర్ల డివైడర్లను కాంట్రాక్టర్లకు అప్పగించామన్నారు. మిగిలిన డివైడర్లను నగరపాలక సంస్థ సిబ్బందితో పర్యవేక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



బొల్లినేని హాస్పిటల్ రోడ్‌లో నిర్వహణకు నోచుకోకుండా..



మోరంపూడి-తాడితోట రోడ్‌లో డివైడర్లపై పెరిగిన మొక్కలు

పర్యావరణాన్ని కాపాడాలి



పర్యావరణ పరిరక్షణ కోసం నగరంలో ఏర్పాటు చేసిన మొక్కల సంరక్షణ బాధ్యత నగరపాలక సంస్థ అధికారులదే. లక్షలాది రూపాయలతో వేసిన అభివృద్ధిని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉంది. ప్రభుత్వాలు మారినా అభివృద్ధిని కాపాడాల్సింది అధికారులే. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి.

– బి.క్రాంతికుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రాజమహేంద్రవరం

పచ్చదనంతోనే సుందర నగరం



పచ్చదనాన్ని కాపాడటం వల్లనే నగరం సుందరంగా తయారవుతుంది. నాటిన మొక్కలను కాపాడినప్పుడే పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుంది. సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. రాజమహేంద్రవరంలో నాటిన మొక్కలను కాపాడటంతో పాటు, సుందరీకరణకు అధికారులు మరిన్ని చర్యలు చేపట్టాలి.

– కె.యుక్తిక, వైద్య విద్యార్థి, రాజమహేంద్రవరం

సాంకేతిక పద్ధతులతో నేరాల నియంత్రణ

నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ: నేర నియంత్రణలో సాంకేతిక విధానాలను అనుసరించాలని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం ఆయన కోరుకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పల్లెల్లో ఘర్షణలు, వివాదాలకు ప్రేరేపించే వారిపై, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని ఆదేశించారు. విస్తృతంగా నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, చోరీలు, ఘర్షణలకు చెక్ పెట్టాలన్నారు. ఆయా కేసులకు సకాలంలో చార్జిషీట్లు వేయాలన్నారు. తొలుత స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. స్టేషన్‌లో సిబ్బంది తక్కువగా ఉండటంతో నేరాలను ఛేదించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు ఈ సందర్భంగా పలువురు పోలీసులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని ఎస్పీకి విన్నవిస్తానని ఆయన తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ సత్యకిశోర్, ఎస్సై నాగార్జున ఉన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వర్షాలతో మెట్ట పైర్లకు జీవం



ఈలకొలనులో సాగు చేస్తున్న మొక్కజొన్న



రంగంపేటలో సాగవుతున్న బెండ తోట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో రెండు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తోంది. పంటలకు నీటి తడుల కోసం ఎదురు చూస్తున్న మెట్ట ప్రాంత రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. మండలంలో వరి, మిరప, పెసర, మినుము, మొక్కజొన్నతో పాటు, వివిధ రకాల కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. ఈ వర్షంతో మెట్ట పంటలు ప్రాణం పోసుకున్నాయి. ఉద్యాన పంటలకు కూడా ఈ వర్షం మేలు చేకూర్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పంటలకు ఈ వర్షం చాలదని, ఇంకా అధిక శాతం వర్షపాతం నమోదు కావాలని నిపుణులు అంటున్నారు. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టామని, వర్షంపైనే ఆశలన్నీ పెట్టుకున్నామని రైతులు చెబుతున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీటీఆర్ఐ: చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని విజయ శంకర ప్రభుత్వ నృత్య సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసశర్మ అన్నారు. ఆదివారం స్థానిక విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో వికసిత్ భారత్-2047, సేవా పర్వం-2025లో భాగంగా ఐదో సంగీత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బోధన, బోధనేతర సిబ్బంది పర్యవేక్షించారు.

మహాలయ పక్ష సేవలతో మెండుగా ఆశీస్సులు



దుప్పట్లు అందజేస్తున్న ఉండవల్లి, కత్తుల తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పితృ దేవతలకు మహాలయ పక్షాన్ని దృష్టిలో ఉంచుకుని తిల తర్పణాలు, పిండ ప్రదానంతో పాటు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ కత్తుల రాజశేఖర్ అన్నారు. ఆదివారం స్వర్ణాంధ్ర సేవా సంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, సేవకు ప్రతిరూపంగా నిలిచిన స్వర్ణాంధ్ర సేవా సంస్థ కార్యదర్శి గుబ్బల రాంబాబును సమన్వయం చేసుకుని చేస్తున్న సేవ ప్రశంసనీయమన్నారు. నగరంలో ఆంధ్ర, తెలంగాణ పరిధిలోని ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఐబీఆర్ఐ), ఇండియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యాన మహాలయ పక్షం సందర్భంగా 15 రోజులుగా పితృ తర్పణాలు, పిండ ప్రదానాలు పవిత్ర గోదావరి తీరాన కోటిలింగాల ఘాట్‌లో నిర్వహించారు. స్వరాంధ్ర సేవా సంస్థ, పుష్కర్ ఘాట్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. మహాలయ అమావాస్య సందర్భంగా లాలా చెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం వద్ద ఆదివారం శాస్త్రోక్తంగా గోదానం చేసి, బ్రాహ్మణులకు దక్షిణలతో స్వయంపాకం అందజేశారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన సంఘ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎంవీ మురళీధరరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బీవీ నారాయణరావు, జనరల్ సెక్రటరీ పీవీ రమణకుమార్, జాయింట్ జనరల్ సెక్రటరీ పీవీ శర్మ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.వీరభద్రరావు, జాయింట్ జనరల్ సెక్రటరీ ఎండీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంద మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

సమాజ చైతన్యానికి గురజాడ కృషి



గురజాడ అప్పారావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

కడియం: ప్రముఖ సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు సమాజ చైతన్యానికి ఎనలేని కృషి చేశారని జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. గురజాడ జయంతిని పురస్కరించుకుని కడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిలుకూరి మాట్లాడుతూ, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్ వంటి విదేశీ భాషల్లో సైతం గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం అనువాదమయ్యాయంటే ఆయన గొప్పదనం అవగతమవుతుందన్నారు. స్థానిక గిరజాల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి స్వామిప్రసాద్, కడియం నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు తదితరులు గురజాడ గొప్పతనాన్ని వివరించారు. అంతకు ముందు గురజాడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక, చెల్లపిల్ల వేంకటశాస్త్రి కళా సేవా సమితి, అరసం సంఘాల ప్రముఖులు ఉంగరాల వీరభద్రరావు, తమ్మిశెట్టి ప్రసాద్, ఆకుల వీర్రాజు, బోణం సత్యనారాయణ, బొర్రా రామకృష్ణ, ఆకుల సూర్యనారాయణ, కె.రవిబాబు, చిక్కాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇసుకతో ప్రమాదాల రిస్కు



మునికూడలిలో రోడ్డుపై జారి పడిన ఇసుక

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డుపై పడి ఉన్న ఇసుకతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాజమహేంద్రవరం-సీతానగరం నాలుగు లేన్ల రోడ్డులో నిత్యం ఇసుక లారీలు ప్రయాణిస్తున్నాయి. రఘుదేవపురం, మునికూడలి, కాటవరం ర్యాంపు నుంచి లారీలపై ఇసుక రవాణా అవుతోంది. ఈ క్రమంలో రాజమహేంద్రవరం-సీతానగరం రోడ్డుపై మునికూడలి నుంచి కాటవరం గ్రామాల్లో లారీల నుంచి ఇసుక పడటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు నడిపినా ప్రమాదం ఖాయమనేలా రోడ్డు తయారైంది. నాలుగు లేన్ల రోడ్డులో సగభాగం ఇసుక పేరుకుపోవటంతో వాహనదారులు జారిపడుతున్నారు. రోడ్డుపై పడిన ఇసుకను ర్యాంపుల నిర్వాహకులే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



కందివలస వెంకటరమణ (ఫైల్)

బిక్కవోలు: అనారోగ్యంగా ఉన్న భార్య కోసం డబ్బు తెస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఇది. ఊలపల్లి గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు కందివలస వెంకటరమణ అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తన భార్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో డబ్బు తీసుకొస్తానని ఈ నెల 19న ఉదయం వెంకటరమణ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి అతడు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య కందివలస నాగజ్యోతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం

సీతానగరం: సెల్‌ఫోన్ ఇవ్వడానికి తల్లి నిరాకరించిందన్న నెపంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గడ్డి మందు తాగిన వంగలపూడికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సుంకపల్లి నరేంద్రకుమార్(20) రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. హెచ్‌సీ రేలంగి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో నరేంద్రకుమార్ బీటెక్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్ ఇవ్వడానికి తల్లి నిరాకరించడంతో శనివారం సాయంత్రం నరేంద్రకుమార్ మనస్తాపం చెందాడు. పొలం కోసం తెచ్చిన గడ్డి మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడినికుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతు ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దసరా వేడుకలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మహోత్సవాలు
- ముస్తాబైన దుర్గాదేవి ఆలయాలు



మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ



విజయ కనకదుర్గాదేవి అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. గ్రామాల్లోని ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో సోమవారం నుంచి 35వ శరన్నవరాత్ర ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ గౌరవ అధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో 11 రోజుల పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తారని ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయంతో పాటు, రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలోను, బొమ్మూరు జాతీయ రహదారి వద్ద కనకదుర్గాదేవి ఆలయంలోను, రాజవోలు రోడ్డులోని కనకదుర్గాదేవి ఆలయంలోను, నాగదుర్గాదేవి ఆలయంలోను, కొంతమూరు బీసీ కాలనీలోని దుర్గాదేవి ఆలయాలతో పాటు, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలోను అమ్మవార్లకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు సిద్ధమవుతున్న విగ్రహాలు

ధవళేశ్వరం: దసరా ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి. సోమవారం నుంచి జరిగే దసరా ఉత్సవాలకు రాజమహేంద్రవరం రూరల్‌లోని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. వివిధ కూడళ్లల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేస్తున్నాయి. శాటిలైట్ సిటీ, మోరంపూడి, ధవళేశ్వరం తదితర ప్రాంతాల్లో విగ్రహాలు తయారు చేసి అమ్మకాలకు అందుబాటులో ఉంచారు. కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను వివిధ ఆకృతులలో రూపొందించారు. విగ్రహాలకు తయారీదారుడు రాము తుది మెరుగులు దిద్దుతున్నాడు. ఈ ఏడాది అమ్మవారి విగ్రహాలకు మంచి డిమాండ్ ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ రూపాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలను కొనేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు తరలివస్తున్నారు. సోమవారం అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో వేలాది మంది భక్తులు భవానీ దీక్షకు సన్నద్ధమవుతున్నారు. పలు ఆలయాల్లో అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన అమ్మవారి విగ్రహం



విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు